మూల్యాంకనంపై అవగాహన

ఏసీసీ, ఏప్రిల్ 2: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంపై అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లకు డీఈవో యాదయ్య ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు బుధవారం ఉదయం 9 గంటలలోగా రిపోర్టు చేయాలన్నారు. కేంద్రంలోకి మొబైల్ ఫోన్ తీసుకుని రావద్దని, క్యాంపు సిబ్బంది ఐడీ కార్డులు ధరించాలన్నారు. క్యాంపు ఆవరణలో ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టవద్దన్నారు.

రంజాన్ వేళలు	
ఇఫ్తార్ (బుధవారం)	6:32
సహర్ (గురువారం)	4:45

ఉపాధి కూలీలకు సౌకర్యాలు ఏవీ..?



- పని స్థలాల్లో కానరాని కనీస ఏర్పాట్లు
- తాగునీరు, నీడ లేక ఇబ్బందులు
- గత సీజన్‌లో లక్ష్యం చేరని పథకం

మంచిర్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అరకొర సౌకర్యాల నడుమ ఉపాధిహామీ పనులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వేసవిలో చేపట్టే ఉపాధిహామీ పనులకు సంబంధించి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. అడవులు, చెరువులు, కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు ఎండలకు విలవిల్లాడుతున్నారు. కూలీలు సేద తీరేందుకు నీడ తాగునీటి సౌకర్యం కూడా లేదు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు గత నెల 31వ తేదీతో ముగియగా, ఈ నెల 1 నుంచి కొత్త సీజన్ పనులు చేపడుతున్నారు.

లక్ష్యం నెరవేరేనా?

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 1లక్షా 20వేల477 కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా, 2 లక్షల 35 వేల 659 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరికి డైలీ వేజెస్ కింద సవరించిన వేతనం ప్రకారం రూ.300 చొప్పున చెల్లిస్తున్నారు. కూలీలకు పనులు కల్పించేందుకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 35 లక్షల పని దినాలు లక్ష్యంగా పెట్టుకోగా వాటిలో 27 లక్షలు మాత్రమే పూర్తయ్యాయి. కేవలం 56,903 కుటుంబాల్లోని 90,130 మంది కూలీలకు మాత్రమే పనులు కల్పించారు. జిల్లాలో లక్ష్యం ఘనంగా ఉండగా, కేవలం 3638 కుటుంబాలకు మాత్రమే 100 రోజుల పని దినాలను కల్పించారు. గత సంవత్సరం లక్ష్యాన్ని పూర్తి స్థాయిలో సాధించలేని అధికారులు ఈ ఏడాదైనా తమ టార్గెట్లను పూర్తి చేస్తారా అనే సందేహాలు కలుగుతున్నాయి. కాగా ఉపాధి పనులకు రోజువారీ వేతనం రూ.300 చెల్లిస్తున్నప్పటికీ, గ్రామాల్లో ఇతర పనులకు వెళితే కనీసం రూ.600 గిట్టుబాటు అవుతాయనే భావనలో కూలీలు ఉన్నారు. దీంతో ఉపాధిహామీ పథకం పనులు చేసేందుకు కూలీలు మొగ్గు చూపడం లేదని తెలుస్తోంది.

లక్ష్యం మేరకు పనులు కల్పిస్తాం..

డీఆర్డీవో కిషన్

ఉపాధిహామీ పథకంలో భాగంగా లక్ష్యం మేరకు పనులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. జాబ్ కార్డు కలిగిన కూలీలకు నిర్దేశిత లక్ష్యం ప్రకారం ఉపాధి కల్పించేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం. మంచి నీటి సౌకర్యం గతంలో కుండలు ఏర్పాటు చేసేవాళ్లం. ప్రస్తుతం కూలీలే తాగునీటిని సమకూర్చుకోవాల్సి ఉంది. ఎండల కారణంగా కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి 9 గంటల కల్లా తిరిగి వస్తున్నారు. దీంతో నీడ సౌకర్యం కల్పించే అవసరం రావడం లేదు.

వేతన సవరణ సరే...భత్యాల సంగతేంది..?

ఉపాధిహామీ పథకం కింద చెల్లించే వేతనాలను ఇటీవల కేంద్ర ప్రభుత్వం సవరించింది. అన్ స్కిల్డ్ కార్మి కులకు రూ. 300 చెల్లిస్తున్నారు. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం వేసవి భత్యం నిలిపివేసింది. అధిక ఉష్ణోగ్రత లతో కూలీలను రక్షించేందుకు మంచినీటి సరఫరా, షేడ్ నెట్లు సమకూర్చుకునేందుకు కొంత మొత్తం చెల్లించేవారు. వేసవిలో పనులు చేసినందుకు 30 శాతం అదనపు భత్యాన్ని చెల్లించే విధానం ఉండేది. కూలీలకు ప్రయాణ, కరువు భత్యం (టీఏ, డీఏ), ఖర్చు కింద గడ్డపారకి రూ. 10, తట్టకు రూ. 5, మంచినీటికి రూ. 5 చెల్లిస్తుండేవారు. అలాగే ఐదు కిలోమీటర్లకు పైగా దూరం నుంచి వచ్చే వారికి రూ. 20 చొప్పుల చెల్లించాల్సి ఉంది. భత్యంతోపాటు పని ప్రదేశంలో విశ్రాంతి తీసుకు నేందుకు టెంట్ సౌకర్యం కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్పులు చేసింది. ఇందు లో భత్యాల చెల్లింపునకు చోటు కల్పించలేదు. కూలీలకు భత్యాలు అందకపోగా మెడికల్ కిట్లు, నెట్లు కూడా సమకూర్చడం లేదు.

రైల్వే అండర్ బ్రిడ్జి మూసివేత

తాండూర్, ఏప్రిల్ 2: మండలంలోని ఐబీ సమీపంలోని శనివారం సంత వద్ద ఉన్న 67వ ఎల్‌సీ రైల్వే అండర్ బ్రిడ్జిని బుధవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రిడ్జి మరమ్మతు కారణంగా మూసివేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఇతర మార్గాల గుండా ప్రయాణించాలని సూచించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శంకర్

భీమారం, ఏప్రిల్ 2: బీజేపీ మండల అధ్యక్షుడిగా బోర్ కుంట శంకర్ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ మంగళవారం జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, ప్రధాన కార్యదర్శి రజనీష్‌జైన్‌లు నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో మడె శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా ట్రెజరీ అధికారికి సన్మానం



ట్రెజరీ అధికారిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు

ఏసీసీ, ఏప్రిల్ 2 : మంచిర్యాల జిల్లా ట్రెజరీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎస్.రాజగోపాల్‌ను పీఆర్‌టీయూ తెలంగాణ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, సూరినేని గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్, బుచ్చన్న పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 2: ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం రాత్రి అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు పీఆర్‌టీయూ తెలంగాణ నాయకులు వినతి పత్రం అందించారు. సురేష్, సుజాత, రామకృష్ణ, శ్రీనివాస్, వెంకటేష్‌సాగర్ పాల్గొన్నారు.

వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలి

ఏసీసీ, ఏప్రిల్ 2: జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు వార్డెన్‌లు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆలిండియా స్టూడెంట్ బ్లాక్ జిల్లా నాయకుడు సన్నిగౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అయన మాట్లాడుతూ పలువురు హాస్టల్ వార్డెన్‌లు హాస్టళ్లలో ఉండకుండా వేరే ప్రాంతంలో ఉండి విధులు నిర్వహిస్తున్నారన్నారు. వెంటనే హాస్టళ్లలో తనిఖీలు చేపట్టి వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గోవింద క్షేత్రంలో పూజలు

హాజీపూర్, ఏప్రిల్ 2: గుడిపేటలోని గోవిందక్షేత్రంలో నిర్మించిన భూవరాహస్వామి, గోవిందరాజస్వామి విగ్రహప్రాణ ప్రతిష్టలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందక్షేత్రం నిర్మాణ దాతలు బిల్ల రాజ్యలక్ష్మీమల్లయ్య దంపతులు పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ ఈఎంటీ డే



కేక్ కట్ చేస్తున్న ఈఎంటీలు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 2: మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని 108 కార్యాలయంలో మంగళవారం నేషనల్ ఈఎంటీ డే వేడుకలను ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా 108 అంబులెన్స్ వాహనాల ప్రోగ్రాం మేనేజర్ స్వామాట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. స్వామాట్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారి వద్దకు సకాలంలో చేరుకుని ఎంతో మంది ప్రాణాలను ఈఎంటీ సిబ్బంది కాపాడుతున్నారన్నారు. చాలా సందర్భాల్లో గర్భిణీలకు అంబులెన్స్‌లోనే ప్రసవాలు చేశారని పేర్కొన్నారు. 108 వాహనాల జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి సంపత్, ఈఎంటీలు, పైలెట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి, ఏప్రిల్ 2: కాసిపేట సాంఘిక సంక్షేమగురుకుల పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు సీవోఈ పరీక్షలో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయ్, దీపక్ గౌలిదొడ్డి సీవోఈలో, దీవక్, వంశీకృష్ణ అలుగూనూరు సీవోఈలో సీట్లు సాధించగా నిఖిల్, కుశాల్, పవన్‌కళ్యాణ్, రాజేష్, సందీప్‌లు ఇబ్రహీంపట్నంలోని సీవోలో సీట్లు సాధించినట్లు తెలిపారు. మంగళవారం విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, జేవీపీ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుమ్మర సంఘం భవనానికి సహకారం అందించాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కుమ్మర సంఘం నాయకులు

ఏసీసీ, ఏప్రిల్ 2: కుమ్మర సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం భూమి, నిధులు కేటాయించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు విజ్జగిరి రామస్వామిలు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు వినతిపత్రం అందించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో సంఘం భవన నిర్మాణానికి మూడు గుంటల భూమి, నిధులు మంజూరయ్యేలా సహకరిస్తానని, కుటీర పరిశ్రమకు మూడెకరాల భూమి, పనిముట్ల కోసం నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని పేర్కొన్నారు. గంగాధరి తిరుపతి, ప్రసాద్, తిరుపతి, సత్యనారాయణ, పాల్గొన్నారు.

వడ్డెరులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 2: వడ్డెరులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో వడ్డెర కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి చేయకపోవడం బాధాకరమన్నారు. వడ్డెరుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేయాలని కోరారు. రమేష్, కుల పెద్దలు పాల్గొన్నారు.

ఓటు ద్వారానే బీజేపీకి బుద్ధి చెప్పాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

జైపూర్, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు ద్వారానే బుద్ధి చెప్పాలని మాలమహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్‌లు పేర్కొన్నారు. మంగళవారం జైపూ ర్‌లో రాజ్యాంగ రక్షణయాత్ర కరపత్రాలను జైభీం సైనిక్‌దళ్ మండల అధ్య క్షుడు పరమేశ్వర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. బీజేపీకి కాకుండా ఇతర పార్టీలకు ఓట్లు వేసి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌ల సూచనల మేరకు రాజ్యాంగ రక్షణ యాత్ర ఈ నెల 5న మంచిర్యాల జిల్లాకు చేరుకుంటుందని, ఈ నెల 8న హైద్రాబాద్‌లో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. శీలం వెంకటేశం, ఎర్రోళ్ల నరేష్, రామస్వామి పాల్గొన్నారు.

నిలిచిపోయిన జంక్షన్ల ఆధునికీకరణ

- డిజైన్లు మార్చాలని ఎమ్మెల్యే ఆదేశం
- రూపొందిస్తున్న అధికారులు



సీసీసీ కార్నర్ చౌరస్తా

నస్పూర్, ఏప్రిల్ 2: నస్పూర్ మున్సిపాలిటీలోని జాతీయ రహదారి- 63పై తొళ్ళవాగు నుంచి శ్రీరాంపూర్ కాలనీ వరకు మూడు చోట్ల జంక్షన్ల ఆధునికీకరణ పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు రూపొందించగా అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మారడంతో జంక్షన్ల డిజైన్లలో మార్పులు చోటు చేసుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు రూ పొందించిన డిజైన్లను మార్చుతూ కొత్త డిజైన్లతో టెండర్లను పిలువాలని నిర్ణయించారు. సీసీసీ కార్నర్, కలెక్టరేట్ చౌరస్తా, శ్రీరాంపూర్ కాలనీ ఎన్‌టీఆర్ చౌరస్తాల్లో పట్టణ ప్రగతి నిధుల నుంచి ఒక్కో జంక్షన్‌కు కోటి రూపాయల చొప్పున ప్రతి పాదించారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ అమలులో ఉన్నందున డిజైన్లు ఫైనల్ కాలేదు. డిజైన్లలో మార్పులుచేర్పులతో జంక్షన్ల పనులు ముందుకు సాగడంలేదు.

● రద్దీని దృష్టిలో పెట్టుకుని..

జాతీయ రహదారిపై వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని జంక్షన్ల నిర్మాణం చేయాలని నిర్ణయించారు. వాటర్ ఫౌంటేయిన్, పక్షుల బొమ్మలు, అడవుల రక్షణ, మొక్కల పెంపక ప్రాధాన్యత, సంస్కృతి సంప్రదాయ వివిధ చిహ్నాల నమూనాలు అధికారులు, ప్రజా ప్రతినిధుల పరిశీలనలో ఉన్నాయి. ప్రాంతాలకు అనుగుణంగా డిజైన్లను మార్చాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అధికారులకు సూచించారు. దీంతో అధికారులు డిజైన్లను తయారు పనిలో నిమగ్నమయ్యారు.

● డిజైన్లలో మార్పులు ...

డిజైన్ల ఎంపిక ఇంకా పూర్తి కాలేదు. మంచిర్యాలలో ఏర్పాటు చేసిన విధంగా జంక్షన్లను ఏర్పాటుకు ప్రతిపాదించారు. అయితే జంక్షన్లు పెద్దగా ఉండి ఇబ్బందులు ఎదురైనందున వాటిని దృష్టిలో పెట్టుకుని నస్పూర్‌లో నిర్మించే జంక్షన్లలో మార్పులు చేశారు. సీసీసీ కార్నర్, తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద దాదాపు 15 లక్షలతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నియంత్రణ సిగ్నల్స్ అలంకార ప్రాయంగా మారాయి. ప్రస్తుతం సిగ్నల్స్ పనిచేయక పోవడంతో ఇష్టానుసారంగా రోడ్డు క్రాస్ చేస్తున్నా రు. కూడళ్లలో జంక్షన్లను నిర్మించే వరకు ట్రాఫిక్ సిగ్నల్స్ మరమ్మతుచేసే అవకాశం లేకుండా పోయింది.

డిజైన్ల ఎంపిక కావాల్సి ఉంది. .

మధు: మున్సిపల్ ఏఈ

సీసీసీ కార్నర్, కలెక్టర్ చౌరస్తా, శ్రీరాంపూర్ కాలనీల్లో ఏర్పాటు చేసే జంక్షన్లకు సంబంధించి డిజైన్లు ఫైనల్ కాలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందుగా డిజైన్స్ చేసి ఫైనల్ చేసాం. ఎన్నికల ముగిసిన తర్వాత ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు డిజైన్లు మార్చాలని సూచించారు. దీంతో కొత్త డిజైన్లను ఎంపిక చేసి ఫైనల్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం డిజైన్లు ఫైనల్ స్టేజీలో ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున ముగిసే వరకు ఆగాల్సి ఉంటుంది. ఫైనల్ అయిన తర్వాత టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు తొందరగానే చేస్తాం.

సమీకృత మార్కెట్ త్వరగా పూర్తి చేయాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 2 : ప్రజలకు కూరగాయలు, మాంసపు ఉత్పత్తులు ఒకే చోట లభించే విధంగా ప్రభుత్వం చేపట్టిన సమీకృత మార్కెట్‌ను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మంగళవారం సమీకృత మార్కెట్, శాఖ గ్రంథాలయాలను మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు కూరగాయలు, మాంసం ఒకే చోట లభించేలా సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో మిగిలి ఉన్న తాగునీరు, మూత్రశాలలు ఇతర పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం శాఖ గ్రంథాలయాన్ని సందర్శించి పత్రికలు, పుస్తకాలు, రిజిస్టర్‌లను పరిశీలించారు. గ్రంథాలయంలో పుస్తకాలు, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి



వడదెబ్బకు గురికాకుండా గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 2: జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు నిరంతరం తాగునీటి సరఫరాకు అదనపు కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, మండల, గ్రామ వార్డు స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి అవసరమైన కార్యాచరణ రూపొందించి చేతి పంపులు, బోర్‌వెల్‌ల మరమ్మతులను చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు సరఫరా చేయాలన్నారు. నీటి సరఫరాకు అవకాశం లేని ప్రాంతాల్లో వ్యవసాయ, తాగునీటి బోరుబావులను అద్దెకు తీసుకుని నీరందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ సౌకర్యాలు కల్పించాలన్నారు. వడగాలులతో ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వడదెబ్బకు గురైతే ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రులకు తరలించేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వడదెబ్బ సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, ప్రత్యేక ఉప పాలన అధికారి చంద్రకళ, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈవో గణపతి, డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారానికి చర్యలు చేపట్టాలి



కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు

నస్పూర్, ఏప్రిల్ 2: గ్రామీణ ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని మంగళవారం బీఆర్ఎస్ నేతలు జిల్లా అధికారులకు వినతిపత్రం అందించారు. కలెక్టరేట్ వద్ద మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ నీరందక పంటలు ఎండిపోతున్నాయని, చేతికందే దశలో పంటలు నష్టపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. పంటల నష్టం అంచనాలు తయారు చేయడానికి అధికార బృందాలను నియమించి నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. ఎకరానికి రూ. 25వేల నష్ట పరిహారం ఇప్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వరి పంటతోపాటు ఇతర పంటలకు మద్దతు ధరకు అదనంగా రూ. 500 రూపాయలు చెల్లించాలన్నారు. యాసంగి పంటలకు బోనస్ చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మంచిర్యాల, నస్పూర్ కు చెందిన బీఆర్ఎస్ నాయకులు గాదె సత్యం, గోగుల రవీందర్ రెడ్డి, సీపతి శ్రీనివాస్, వంగ తిరుపతి, గౌస్, గరిసె భీమయ్య, ముక్కెల వెంకటేశ్, చంద్రశేఖర్, మెరుగు ప్రవన్‌కుమార్, మల్లేష్, అంకం నరేష్, తిప్పని రామయ్య, వెంకట్‌రావు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలను అనుమతించాలి

జన్నారం, ఏప్రిల్ 2 : జన్నారం మీదుగా భారీ వాహనాల రాకపోకలను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ప్రజలు విన్నవించారు. వారు మాట్లాడుతూ కొంత కాలంగా జన్నారం రహదారిపై అటవీ శాఖ భారీ వాహనాలను అనుమతించాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే కవ్వాల్ టైగర్ రిజర్వు ఫీల్డ్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని డైరెక్టర్ చెప్పినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి సుగుణ, సామాజిక పోరాట సమితి నాయకులు భూమాచారి, ఓంకారేశ్వర్, మహేష్, తిరుపతి, అక్బర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్



సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్

ఏసీసీ, ఏప్రిల్ 2: పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు, బాధితులకు సత్వర సేవలందించేందుకు ప్రత్యేక సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రామగుండం కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో సైబర్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో పర్యవేక్షక అధికారిగా ఏసీపీ వెంకటరమణతో పాటు సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఒక హెడ్ కానిస్టేబుల్, ఏడు గురు కానిస్టేబుళ్లు పని చేస్తారన్నారు. లక్ష రూపా యలు, అంతకన్నా ఎక్కువ విలువైన మోసాలకు గురైతే నేరుగా ఫిర్యాదులు చేసేం దుకు అవకాశం ఉంటుందన్నారు. లక్ష రూపాయల కన్నా తక్కువగా ఉన్న సైబర్ నేరాల్లో బాధితులు వారి పరిధిలోని పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సైబర్ మోసాలకు గురైతే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని లేదా www.cyber-crime.gov.inలో ఫిర్యాదు చేయ వచ్చన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం, ఏప్రిల్ 2: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. మంగళవారం పైడిపల్లి గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తనను గుర్తించి ఎంపీ టికెట్ ఇచ్చిందని, ఈ ప్రాంత నాయకులు, కార్యకర్తలు గెలుపునకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల న్నారు. తనను గెలిపిస్తే పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ఎంపీ అభ్యర్థి సుగుణ గెలుపునకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలతో ప్రజలు సం తోషంగా ఉన్నారన్నారు. అనంతరం పలు పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు ముజాపర్‌ఆలీఖాన్, నాయకులు సుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజశేఖర్, రాజన్న, సతీష్, పసివుల్లా, రియాజుద్దీన్, నందునాయక్, హజారుద్దీన్, చంద్రయ్య, గంగన్న, సుధాకర్, షాకీర్, రమేష్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పదవీ విరమణ పొందిన కానిస్టేబుల్ ఎస్‌కె అహ్మద్, హోంగార్డు ఎస్‌కె సాజీద్‌లను శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత

కాసిపేట, ఏప్రిల్ 2: సోమగూడెం చొప్పరిపల్లె చెక్‌పోస్టు వద్ద మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.70 వేల నగదును పట్టుకున్నారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానేపల్లి మండలం బాబాసాగర్‌కు చెందిన గోలం నరేష్ మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్ వైపు వెళ్తుండగా అతన్ని తనిఖీ చేయగా నగదు పట్టుబడిందని పోలీసులు తెలిపారు. నగదుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

ఏసీసీ, ఏప్రిల్ 2: పట్టణంలోని గౌతమినగర్‌లో నివాసం ఉండే దానేష షని (22) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన షని పట్టణంలోని గౌతమినగర్‌లో అక్క, బావలతో కలిసి ఉంటూ హోటల్‌లో పనిచేస్తున్నాడని తెలిపారు. కొన్ని రోజులుగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్నాడన్నారు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. మృతుడి అక్క అనిత టాకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్


సీజ్ చేసిన వాహనాల వద్ద సీఐ, పోలీసులు

చెన్నూరు, ఏప్రిల్ 2: మండలంలోని కన్నెపల్లి, బుద్దారం గ్రామాల్లో మంగళవారం సీఐ రవీందర్ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, ఒక టాటా ఏస్ వాహనాలను సీజ్ చేశారు. రెండు గ్రామాల్లో 15 లీటర్ల నాటుసారా, 10 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

భీమారం, ఏప్రిల్ 2 : భీమారం మండల కేంద్రంలోని తండాలో మంగళవారం గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్ఐ రాములు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ గుడుంబాను తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేయగా ఐదు లీటర్ల గుడుంబా దొరికిందన్నారు. గుడుంబా తయారు చేస్తున్న తేజావత్ తుకారాం, దబ్బెట రాములుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గుడుంబా విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ మాచర్ల, పోలీసు లక్ష్మయ్య పాల్గొన్నారు.

భూమి అప్పగించాలని బాధితుల ఆందోళన

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

తాండూర్, ఏప్రిల్ 2: మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలోని రేచిని గ్రామపంచాయతీ పరిధిలోని బారేపల్లి గ్రామస్థులు మంగళవారం తమకు కేటాయించిన భూమి అప్పగించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆదె శ్రీనివాస్ అనే యువకుడు న్యాయం చేయాలని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. రెవెన్యూ సిబ్బందితోపాటు అక్కడే పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ లక్ష్మణ్ గమనించి సంఘటన స్థలానికి వచ్చి ఆత్మహత్యాయత్నాన్ని విరమింపజేశారు.

బాధితులు మాట్లాడుతూ బారేపల్లి గ్రామంలో 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 60 మంది పేదలకు ఇంటి నిర్మాణానికి స్థలాలు కేటాయించిందన్నారు. స్థలాలను గ్రామానికి చెందిన సుబ్బ దత్తుమూర్తికి చెందిన సర్వే నెంబరు 41/అలో నుంచి ఎకరం 17 గుంటలు, డోకె లక్ష్మీకి చెందిన సర్వే నెంబరు 45/అలో నుంచి ఎకరం 25 గుంటల భూమి సేకరించి వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందన్నారు. సేకరించిన భూమిలో 60 ప్లాట్లు చేసి పేదలకు అందజేశారన్నారు. కానీ ఆ స్థలంలో ఇండ్లు నిర్మించుకోలేదన్నారు. తాండూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు, సింగిల్‌విండో చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి ప్రభుత్వానికి అప్పజెప్పిన భూమిని రాజకీయ పలుకుబడితో ధరణి పోర్టల్‌లో తిరిగి అతడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, రైతుబంధు సైతం పొందుతున్నాడన్నారు. సుబ్బ దత్తుమూర్తి ఫ్లెక్సీతో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. దత్తుమూర్తి అక్రమంగా చేయించుకున్న పట్టాను రద్దు చేసి ప్రభుత్వం తమకు భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా భూమిని పట్టా చేయించుకున్న దత్తుమూర్తిపై, సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధితులు ఆందోళన చేస్తున్న సమయంలో తహసీల్దార్ బెల్లంపల్లిలో సమావేశానికి వెళ్లగా సిబ్బంది ఫోన్ ద్వారా విషయం తెలిపారు. విచారణ చేపడతానని, న్యాయం జరిగేలా చూస్తానని, సిబ్బందికి వినతిపత్రం ఇవ్వాలని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జగదీష్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఆందోళనలు చేపట్టవద్దని సూచించారు. సమస్యలుంటే అధికారులకు విన్నవించాలని, ఆత్మహత్యాయత్నం లాంటివి చేయవద్దని హెచ్చరించారు. బాధితులు కార్యాలయంలో వినతిపత్రం అందించి వెళ్లిపోయారు.

ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలి

వేమనపల్లి, ఏప్రిల్ 2: ప్రతీ గ్రామ పంచాయతీలోని ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీలందరికి వంద రోజుల పనులు కల్పించాలని, రూ. 300 అందేలా మార్కింగ్ ఇచ్చి పనులను చేయించాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను హరితహారానికి సిద్ధం చేయాలని, పల్లె ప్రగతి కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీవో సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఉపాధిహామీ పనులపై ఎంపీడీవో రాజేశ్వర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో 150 మందికి తగ్గకుండా కూలీలు ఉండేలా చూడాలన్నారు. పనులు చేపట్టే ప్రాంతాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏపీవో రజియాసుల్తానా, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు. పులిమడుగు, బొక్కలగుట్ట గ్రామాల్లో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 వేతనం అందుతుందన్నారు.

భీమిని: ఉపాధిహామీ కూలీలు ఎండలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో గంగమోహన్ సూచించారు. మల్లీడి, రాంపూర్, బిట్టూరుపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు జాగ్రత్తలు, పనిపై అవగాహన కల్పించారు. కూలీలు ఉదయం సమయంలోనే పనులు పూర్తి చేయాలన్నారు. ఏపీవో భాస్కర్ రావు, ఈసీ సత్యనారాయణ, టీఏ వేణు, శ్యాంకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: ఉపాధిహామీ పనులను ఎంపీడీవో రాథోడ్ రాధ పరిశీలించారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని, ఎండలు ఎక్కువగా ఉన్నందున త్వరగా పనులు ముగించుకోవాలన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న నిందితుల అరెస్టు

బెల్లంపల్లి, ఏప్రిల్ 2: గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం డీసీపీ వివరాలను వెల్లడించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన లింగాల యశ్వంత్, తోట మనిదీప్, నవీద్, ముజ్జులు మహారాష్ట్రలోని చంద్రపూర్, బల్లార్షాల నుంచి పెద్ద ఎత్తున గంజాయిని కొనుగోలు చేసి బెల్లంపల్లిలో అమ్ముతున్నారన్నారు. గత నెల 24న చంద్రపూర్ వెళ్లి గంజాయిని తీసుకువచ్చారని తెలిపారు. యశ్వంత్, మణిదీప్‌లు 1100 గ్రాముల గంజాయిని అమ్మడానికి మంగళవారం కొత్త బస్టాండ్ సమీపంలో ఉండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ రమేష్ నిందితులను పట్టుకున్నారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సర్దార్ పాపన్నగౌడ్ వర్ధంతి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 2: జిల్లా కేంద్రంలోని చార్వాక ఆసుపత్రిలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం సర్దార్ పాపన్నగౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలకంటేశ్వర్‌రావు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ నాయకులు రాజు, సంతోష్‌బాబు, శ్రీనివాస్, రాజేశంగౌడ్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్‌లు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రంగు రవీందర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, రాజ్‌కుమార్‌గౌడ్, పోచగౌడ్, రాజయ్యగౌడ్, నర్సయ్యగౌడ్, జగదీష్‌గౌడ్, రవీందర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

తాండూర్, ఏప్రిల్ 2: మాదారం త్రి ఇంక్లైన్‌కు చెందిన శనిగారపు సుజాతకు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి రూ.5 లక్షల ఎల్‌వోసీని మంగళవారం అందజేశారు. సుజాత కుమార్తె శ్రావణి అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయాన్ని ఎంపీటీసీ రవీందర్ రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షల ఎల్‌వోసి అందజేశారు. గట్టు మురళీధర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజిక సేవకు నంది పురస్కారాలు


నంది పురస్కారం అందుకుంటున్న గజెల్లి మోహన్, రాజలింగు, సత్యనారాయణ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 2: శ్రీరాంపూర్ చెందిన మాజీ సింగరేణి కార్మికుడు గజెల్లి రాజలింగు చేస్తున్న సామాజిక సేవకు నంది ప్రతిభా పురస్కారం-2024 లభించింది. శిఖర ఆర్ట్స్ సంస్థ సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజలింగు పురస్కారం అందుకున్నారు. రాజలింగు సింగరేణి కార్మికుడిగా పనిచేసి రిటైర్ అయ్యారు. సింగరేణి కమ్యూనికేషన్ సెల్ ద్వారా ఎన్నో సందేశాత్మక నాటకాలు వేశారు. సీరియల్స్, చిత్రాల్లోనూ ఆయన నటించారు. హరితహారం, అక్షరాస్యత, మూఢనమ్మకాల నిర్మూలనలో పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: చిర్రకుంట మాజీ ఉపసర్పంచు ఎనగందుల సత్యనారాయణ సామాజిక సేవా, పేదలకు సహాయం చేసే కార్యక్రమాలు చేపట్టినందుకు నంది ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు.

బెల్లంపల్లి: బాబుక్యాంపు బస్తీకి చెందిన సామాజిక సేవా కార్యకర్త గజెల్లి మోహన్‌కు నంది పురస్కారం దక్కింది. 30 ఏండ్లుగా బెల్లంపల్లిలో విశిష్ట సేవలందిస్తున్న మోహన్‌కు నంది పురస్కారాన్ని అందించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా, ప్రోగ్రాం ఆఫీసర్‌గా, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధిగా, గజెల్లి చారిటుబల్ ట్రస్టు నిర్వాహకుడిగా సేవలందిస్తున్నందుకు పురస్కారం వచ్చింది. బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న మోహన్‌ను మంగళవారం ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ అభినందించారు.

మాదిగలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం


మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య

బెల్లంపల్లి, ఏప్రిల్ 2: కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు కొమ్ముకాస్తూ మాదిగలకు పార్లమెంట్ టికెట్‌లు కేటాయించకుండా మోసం చేస్తుందని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ పేర్కొన్నారు. టికెట్‌లు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం కాంటా చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 17 పార్లమెంట్ సీట్లు ఉండగా మూడు రిజర్వు స్థానాలు ఉన్నాయని చెప్పారు.. మాదిగలకు రెండు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌చార్జీ కల్వల శంకర్, నాయకులు పాల్గొన్నారు.

వేసవి దృష్ట్యా ప్రత్యేక చర్యలు

- అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ - కలెక్టర్ వెంకటేష్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2: వేసవిలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలను ఎండ తీవ్రత నుంచి రక్షించేందుకు జిల్లాలో అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టరేట్ చాంబర్‌లో జిల్లా అదనపుకలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్‌తో కలిసి టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాల నిర్వహణ కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా విద్యాశాఖ, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆరోగ్య, ఆశా కార్యకర్తల వద్ద వడదెబ్బకు గురైన బాధితులకు తక్షణ ఉపశమనంకొరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఓఆర్ఎస్ ప్యాకేట్లు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులు బయట తిరగకుండా అధికారులు దృష్టి సారించాలన్నారు. ఉపాధి పనుల ప్రదేశాల్లో, వరి కొనుగోలు కేంద్రాల వద్ద షామియానాలు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకేట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి గ్రామంలో, మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని, పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టిలు ఉండేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తుకారాం, గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, డీఈవో అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, డీపీవో ఉమర్‌హుస్సేన్, కమిషనర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెంచికలపేట, ఏప్రిల్ 2: మండలంలోని ఎల్లూరు, కొండపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలని ఏడీ రాజుల నాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటాలు ఏ-గ్రేడ్ రకం రూ.2203, కామన్ రకం రూ.2183 మద్దతు ధర ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోపాల్, రైతులు పాల్గొన్నారు.

దహెగాం: లగ్గాం, ఒడ్డుగూడ, గిరివెల్లి గ్రామాల్లో మంగళవారం వరి కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ సీఈవో బక్కయ్య ప్రారంభించారు. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు వంశీ, జ్ఞానేశ్వర్, సిబ్బంది నారాయణ, జీవన్, సాయి పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని లోనవెల్లి(దుబ్బగూడ) గ్రామంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీపీఎం రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం దుర్గయ్య, సీసీ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

బెజ్జూరు: కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాని ఆర్ఐ సంతోష్ అన్నారు. మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అచ్యుత్‌రావు, సీఈఓ వెంకటేశ్వర్‌గౌడ్, ఇన్‌చార్జి సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని రవీంద్రనగర్-1 గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ సీఈవో రాజేష్ మంగళవారం ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువుల కొట్టం దగ్ధం

పెంచికలపేట, ఏప్రిల్ 2: మండలంలోని చెడ్వాయి గ్రామంలో మంగళవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పశువుల కొట్టం కాలిపోయింది. గ్రామానికి చెదిన చౌదరి పెంటయ్యకు చెంది పశువుల కొట్టడంతో షార్ట్ సర్క్యూట్‌తో మంటల అంటుకోవడంతో కుటుంబసభ్యులు గమనించి మండలను ఆర్పివేవారు. కొట్టంలో ఉన్న వ్యవసాయ సామగ్రికాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

ఆస్పత్రిలో అధికారుల విచారణ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 2: కాగజ్‌నగర్ శ్రీ శైన్ ఆస్పత్రిలో మంగళవారం అడిషనల్ డీఎంహెచ్‌వో సీతారాం, టీబీ ప్రోగ్రాం అధికారి సునీల్‌రావు విచారణ చేపట్టారు. ఈ ఆస్పత్రి ఏర్పాటులో వివాదం నెలకొంది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

అర్చకుడికి నంది పురస్కారం

రెబ్బెన, ఏప్రిల్ 2: రెబ్బెన ఇందిరానగర్‌లోని శ్రీ కనక దుర్గాదేవి ఆలయ అర్చకుడు దేవర వినోద్‌కు నందిపురస్కారం లభించింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో సోమ వారం సాయంత్రం శిఖర ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ పురస్కారం అందజేశారు. సామాజిక సేవ, అధ్యాత్మిక రంగంలో సేవలు అందించిన సందర్భంగా ఈ అవార్డు అందుకున్నారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

దహెగాం, ఏప్రిల్ 2: దహెగాం మండలం ఒడ్డుగూడ గ్రామానికి చెందిన బాలిక (16) అదృశ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. బాలిక ఆదివారం ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా వెళ్లి పోయినట్లు ఫిర్యాదు చేశారని చెప్పారు. బంధువుల ఇళ్లలో, పరిసర గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించక లేదన్నారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బెజ్జూరుకు చేరుకున్న భీం దీక్ష యాత్ర

బెజ్జూరు, ఏప్రిల్ 2: అంబేద్కర్ సంఘం తాలూకా అధ్యక్షుడు విశ్వనాథ్ ఆధ్వర్యంలో కౌటాల మండలం నుంచి బయలుదేరిన రాజ్యాంగ అవగాహన, భీం దీక్ష యాత్ర మంగళవారం బెజ్జూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బుద్ధ విహార్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భీం దీక్ష యాత్రతికులు శీల్‌రత్న, పత్రు, అశోక్, కిశోర్, శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కెరమెరి, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో బుధవారం మరమ్మతులు ఉన్నందున విద్యుత్ సరఫ రాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గం నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

తిర్యాణి, ఏప్రిల్ 2: తిర్యాణి మండలం దుగ్గాపూర్ మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని నిర్వహించారు. పుస్తక పఠనంతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని సీఆర్పీ రాజేష్ అన్నారు. కార్యక్రమంలో రూం టూ రీడ్ బ్లాక్ కో ఆర్డినేటర్ శ్రీనివాసచారి పాల్గొన్నారు.

ప్రతీ నీటి చుక్కను పొదుపు చేయాలి

సిర్పూర్(టి), ఏప్రిల్ 2: ప్రతీ నీటి చుక్కను పొదుపు చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని చేపడుతున్న ఇంకుడు గుంతలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో కృష్ణమూర్తి, ఏపీవో రాజు, సిబ్బంది ఉన్నారు.

గుడుంబా పట్టివేత

చింతలమానేపల్లి, ఏప్రిల్ 2: రవీంద్రనగర్ గ్రామంలో బిద్య సమరేష్ పంక్చర్ దుకాణంలో తనిఖీ చేయగా 3.86 లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించగా గుడుంబా పట్టుబడినట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి


నినాదాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 2: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు తెలిపారు. కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులు చేపడుతున్న ధర్నాకు మంగళవారం మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెప్పారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో దశల వారి ఉద్యమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్‌తో పాటు కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సన్మానం

రెబ్బెన, ఏప్రిల్ 2: ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుని నాలుగో స్థానంలో నిలువడంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంళవారం ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, మేనేజర్ ప్రవీణ్, ఇంజనీర్ వీరన్నను సన్మానించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో సింగరేణి సంస్థలోనే నాలుగో స్థానం రావడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మారం శ్రీనివాస్, కిరణ్‌బాబు, దివాకర్, రాజయ్య, తోట మల్లేష్, నరేష్, వినోద్, రవి, మల్లేష్, ఓదెలు, రమేష్, ధర్మయ్య పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

రెబ్బెన, ఏప్రిల్ 2: రెబ్బెనలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు మోడెం సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రెబ్బెన గౌడ సోసైటీ అధ్యక్షుడు తాళ్లపల్లి కిష్టగౌడ్, సభ్యులు మడ్డి శ్రీనివాస్, చిరంజీవిగౌడ్, అన్నపూర్ణ మురళీగౌడ్, పందిర్ల స్వామి గౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాంకిడిలో రూ.లక్ష పట్టివేత

వాంకిడి, ఏప్రిల్ 2: వాంకిడి మండలంలోని టోల్ ప్లాజా చెక్ పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీల్లో సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. లక్ష నగదును పట్టుకున్నట్లు వాంకిడి సీఐ శ్రీనివాస్ తెలిపారు. చంద్రాపూర్ నుంచి మంచిర్యాలకు కారులో వెళ్తున్న చంద్రాపూర్‌కు చెందిన వ్యక్తి వద్ద లక్ష రూపాయలు పట్టుబడ్డాయని చెప్పారు. డబ్బులకు సంబంధించి తగిన ఆధారాలు లేక పోవడంతో నగదును సీజ్ చేశామని అన్నారు. పట్టుకున్న నగదును ఎఫ్ఎస్టీ టీంకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఈ తనఖీల్లో కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు, ఎస్సై సాగర్‌లు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2: కరువు కాలంలో తీవ్రంగా నష్ట పోయిన రైతులకు పంటనష్ట పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు సమస్య లను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయక సతమతమవుతుం దన్నారు. పంట సాగుకు నీరందక ఎండి పోయిన పంటలను గుర్తించి ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని, రైతులు పండించిన పంటకు రూ.500 బోనస్ ప్రకటిస్తామని, రైతు బంధు కింద ఎకరానికి కౌలు రైతులకు రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిందన్నారు. ఇప్పటి వరకు అందించలేదని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ల ఆధా రంగానే ఉద్యోగాల నియమకాలు చేపడుతుందని తెలిపారు. అబద్దపు ప్రచా రాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏవో రఫత్‌కు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్రావు, అజయ్, సంతోష్, ధ్రుపతాబాయి, ఎంపీపీ మల్లికార్జున్, పీఏసీఎస్ ఛైర్మన్ అలీబీన్ అహ్మద్, నాయకులు సరస్వతి, కలాం, లాలా,నిసార్, జీవన్,రవి, ఆశన్న, భీమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటర్ల భద్రతే ధ్యేయం



ఎదులవాడలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 2: జిల్లాలో ఓటర్ల భద్రత కోసమే కవాతు నిర్వహిస్తున్నామని అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని రౌటసంకెపల్లి, అడ్డఘట్ గ్రామాల్లో సీఐ సతీష్, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బద్రిప్రసాద్, ఎస్సై రాజేశ్వర్,ప్రవీణ్, సీఆర్పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంబంధించిన ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబరు 1950కు, సీ విజిల్ అప్లికేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, మజీద్‌లు, చర్చిలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి ఎన్నికల ప్రచారాలు నిర్వహిం చొద్దని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఎదులవాడలో పోలీసు కవాతు నిర్వహించారు.

వాహనాలు తనిఖీ చేయాలి

వాంకిడి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టుల్లో పకడ్బందీగా వాహనాలను తనిఖీ చేయాలని అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు సూచించారు. అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ సదయ్యతో కలిసి వాంకిడి టోల్ ప్లాజా చెక్ పోస్టును మంగళవారం తనిఖీ చేశారు. వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తనిఖీ కేంద్రాల వద్ద చెక్ పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాల న్నారు. నగదు, మద్యం, గంజాయి, వరి ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, సీఐ రాంబాబు, ఎస్సై సాగర్ పాల్గొన్నారు.

జిల్లాలో పెరిగిన పోలింగ్ కేంద్రాలు

- గతంలో 597, ప్రస్తుతం 676కు పెంపు
- రెండు నియోజకవర్గాల పరిధిలో 79 ఏర్పాటుకు ప్రతిపాదన
- లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లకు తగ్గనున్న దూరం
- నిబంధనల మేరకు అధికారుల చర్యలు



ఎన్నికల షెడ్యూల్ వెలువడింది మొదలు జిల్లాలో అధికారులు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఓ వైపు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై దృష్టి పెడుతూనే మరోవైపు విధి నిర్వహణలో ఉండే సిబ్బందికి శిక్షణ దిశగా కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పుల విషయంలో వచ్చిన అభ్యర్థనల మేరకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాల్లో వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఓటర్లకు దూరబారం తగ్గించేందుకు అదనపు కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు ప్రారంభించారు. గత శాసనసభ ఎన్నికలతో పోలిస్తే ఈ సారి జిల్లాలో కొత్తగా 79 యాగ్జలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. ఆయా కేంద్రాలలో తాగు నీరు, విద్యుత్, ఫ్యాన్లు, ర్యాంపుల వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

రెండు నియోజకవర్గాల పరిధిలో..

జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ రెండు నియోజకవర్గాలలో గత శాసనసభ ఎన్నికలలో 597 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాస్తవానికి ఓటర్లకు రెండు కిలోమీటర్లలోపు కేంద్రాలు ఉండేలా చూడాలి. కాగా కొన్నిచోట్ల 10 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్నాయి. దీంతో ఎన్నికల సమయంలో కొందరు దూరం నుంచి వచ్చి ఓటు వేయలేక పోతున్నట్లు ఎన్నికల సంఘం గుర్తిం చింది. ఈ సారి ఆలా కాకుండా అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో ఓటర్లకు మరింత చేరువయ్యేలా చుడాలని బావించింది. దీంతో జిల్లా అధికారులు కొత్తగా యాగ్జలరీ పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఆసిఫాబాద్ నియోజకవ ర్గంలో శాసనసభ ఎన్నికల్లో 304 కేంద్రాలు ఉండగా కొత్తగా గుర్తించిన 52తో కలిపి 356 చేరనున్నాయి. సిర్పూర్ నియోజక వర్గంలో కొత్తగా 27 గుర్తించడంతో వీటి సంఖ్య 320కి చేరింది. మొత్తంగా జిల్లాలో కొత్తగా పోలింగ్ కేంద్రాల సంఖ్య 676కు చేరింది.

వసతుల కల్పనపై..


పాత వాటితో పాటు కొత్తగా గుర్తించిన అన్ని కేంద్రాల్లో ఓటర్లకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించడంపై అధికారులు దృష్టి సారించారు. ఇందుకుగాను సెక్టోరల్ అధికారులతో ఇప్పటికే సమావేశం నిర్వహించి వసతుల కల్పనపై దిశానిర్ధేశం చేశారు. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన వసతుల కోసం సంబందిత తహసీల్దార్, ఎంపీడీవోలకు నివేదిక సమర్పించారు. సదరు అధికారులు పూర్తి సౌకర్యాలు కల్పించాలి. ఒక కుటుంబంలోని ఓటర్లందరు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలి. ప్రతీ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు ఉండేలా చుడాలి. పోలింగ్ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి. వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపులు, వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలి. యువత, మహిళ, దివ్యాంగుల కోసం ఆదర్శ పోలింగ్ కేంద్రాలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.



గోండుగూడలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రం

గోండుగూడలో సైతం..

మండలంలోని కొడియన్ మోవాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని గోం డుగూడలో కొత్తగా పోలింగ్ కేంద్రం కోసం ప్రతిపాదించారు. కొడియన్ మోవాడ్‌లో సుమారు 100కు పైగా ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికలలో వీరంత 10 కిలోమీటర్ల దూరంలోని బలాన్‌పూర్ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడియన్ మోవాడ్ నుంచి బలాన్‌పూర్ వెళ్లె దారిలో వాగు ఉండడంతో ఓటింగ్ సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈసారి కొత్తగా గోండుగూడలో పోలింగ్ కేంద్రంల ఏర్పాటు చేయడంతో ఓటర్లకు దూర భారం తగ్గింది.



రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- సిబ్బంది సమయపాలన పాటించాలి - కలెక్టర్ వెంకటేష్ దోత్రే



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది స్నేహపూర్వకంగా మెదులుతూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారి తుకారాంతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పలు వార్డులు, రిజిస్టర్లు, రికార్డులు, మందుల నిలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని చెప్పారు. రోగులకు అందుబాటులో ఉంటూ వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది చూడాలన్నారు. ప్రసుత్తం ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వడదెబ్బ బాధితులకు సరైన చికిత్స అందించాలని, ఇందుకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికలలో విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించి జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలోని బూర్గుడలో గల డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ బీఈడీ కళాశాలలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఆర్వో సురేష్, తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండేతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు తమ విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు పోలింగ్ రోజు, ముందు రోజు చేపట్టాల్సిన విధులను సమర్థవంతంగా నిర్వహిం చాలన్నారు. పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులు అందించే శిక్షణ ముఖ్యమైనదని, మాస్టర్ ట్రైనర్లు ప్రతీ అంశాన్ని అధికారులు క్షుణ్ణంగా వివరించాలని తెలిపారు. పీవో డైరీ, 17సి, ఈవీఎం, వీవీ ప్యాట్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్లతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, పోలింగ్ అధికారులు, పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

కాగజ్‌నగర్: పార్లమెంటు ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కాగజ్‌నగర్‌లోని వివేకనంద కళాశాలలో పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు ముందస్తుగా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ఎలాంటి అనుమానాలున్నా కూడా నివృత్తి చేసుకోవాలని కోరారు. ఓటర్లు శాంతి యుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలింగ్ బూత్‌లకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. అధికారులు ముందుగానే అన్ని విష యాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో సురేష్, తహసీల్దార్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షలు స్వీకరణ

ఆసిపాబాద్‌రూరల్, ఏప్రిల్ 2: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో ఈ నెల 23న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం 150 మది భక్తులు హనుమాన్ మాల అర్థమండల దీక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి అర్చకులు ఒజ్జల శిరీష్ శర్మ, శేఖర్ శర్మ, శ్రీనివాస్‌శర్మ, మహేష్ శర్మల ఆధ్వర్యంలో గణపతిపూజ, నవగ్రహ పూజ, ఆంజజనేయస్వామికి రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామ పూజ నిర్వహించారు. అనంతరం దీక్షా పరులకు మాల దారణ కార్యక్రమాన్ని అత్యంత కన్నుల పండువగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వవేక్, రూప్‌నార్ రమేష్, ఎకిరాల శ్రీనివాస్, కృపాల్, మధు, సుధాకర్, నారాయణమూర్తి, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కర్జవెల్లిలో పోలీసుల కార్డన్‌సెర్చ్

చింతమానేపల్లి, ఏప్రిల్ 2: మండలంలోని కర్జవెల్లి గ్రామంలో సీఐ సాధిక్‌పాషా ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో మంగళవారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడానలి ప్రజలకు సూచించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు ఉంటాయని అన్నా రు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

6న మండల సర్వ సభ్య సమావేశం

దహెగాం, ఏప్రిల్ 2: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 6న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

కేటగిరీ ప్రమోషన్ లెటర్లు అందజేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ పేరుతో కార్మికులకు ఇవ్వాల్సిన కేటగిరీ ప్రమోషన్ లెటర్లు ఇవ్వకపోవడం సరైంది కాదని, వెంటనే అందజేయాలని ఏఐటీ యూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. ఎస్ఆర్‌పీ 3 గనిపై వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి యేటా ఇవ్వాల్సిన లెటర్లు పార్లమెంట్ ఎన్నికల కోడ్ పేరుతో నిలిపివేయడం దారుణమన్నారు. అలాగే గుర్తింపు ఎన్నికలు జరిగి మూడు నెలలు అవుతున్నా తమ యూనియన్‌కు లెటర్ ఇవ్వలేదన్నారు. దీనివల్ల వివిధ సమావేశాల్లో కార్మిక సమస్యలపై చర్చించేందుకు అవకాశం లేకుండా పోతోందని చెప్పారు. తమ యూనియన్ అధికారంలోకి వచ్చాక అవినీతికి తావులేకుండా కార్మికుల పక్షాన నిలబడుతూ వారికి సేవలందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, పిట్ కార్యదర్శి మురళీ చౌదరి, మైనింగ్ స్టాఫ్ నాయకుడు మారేపల్లి బాబు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పాల్గొన్నారు.

కోల్ ఇండియా పోటీలకు ఎంపిక

శ్రీరాంపూర్, ఏప్రిల్ 2: శ్రీరాంపూర్‌లోని ఆర్‌కె 7 గనిలో కోల్ కట్టర్‌గా పనిచేసే కొండ కార్తీక్ ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు సింగ్రోలి జిల్లా కొక్రి ఏరియా గ్రామంలో నిర్వహించే కోల్ ఇండియా కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. కార్తీక్ చిన్ననాటి నుంచి మంచిర్యాల జిల్లా పక్షాన జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రాతినిథ్యం వహించాడు. సింగరేణిలో ఉద్యోగం పొందిన తరువాత కూడా కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాడు. కార్తీక్ ఎంపిక కావడంపై మంచిర్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రాంచందర్, ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 2: తమ సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర వేతన సలహా మండలి ఛైర్మన్ బి జనక్‌ప్రసాద్‌ను కోరారు. సీసీసీలోని సివిల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు తమ సమస్యలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీ యూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు, జాతీయ సమితి సభ్యుడు సీహెచ్ భీంరావు, కేంద్ర కమిటీ నాయకులు గరిగె స్వామి, కలవేన శ్యామ్, పేరం రమేశ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ బలోపేతానికి కమిటీలు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 2: సింగరేణిలో దాదాపు దశాబ్దన్నర కాలం పాటు గుర్తింపు సంఘంగా పనిచేసిన బీఆర్ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం బలోపేతానికి కమిటీల నియామకానికి చర్యలు చేపడుతోంది. గత సంవత్సరం డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో యూనియన్ గౌరవాధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత ఆదేశాల మేరకు పోటీ చేయలేదు. దీంతో మనస్తాపం చెందిన టీబీజీకేఎస్ నాయకులు సింగరేణిలో యూనియన్ స్వయం ప్రతిపత్తి లక్ష్యంగా పలు నిర్ణయాలు తీసుకుంటు న్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి నేతృత్వంలో గోదావరిఖనిలో ఇటీవల సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేయడం పట్ల అసంతృప్తికి లోనైన యూనియన్ గౌరవాధ్యక్షుడు వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, మిర్యాల రాజిరెడ్డి రాజీనామా చేశారు. ప్రస్తుతం వెంకట్రావు, మల్లయ్యలు కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయించుకున్నారు. ఇక యూనియన్ పగ్గాలను రాజిరెడ్డి చేపట్టేందుకు నిర్ణయించారు. దీనిలో భాగంగా సింగరేణిలోని 11 ఏరియాల్లో నూతన కమిటీలను వేయాలని నిర్ణయించుకున్నారు. గత రెండు రోజుల క్రితం సమావేశంలో కమిటీల నిర్ణయం తీసుకున్నారు. రాజిరెడ్డితో పాటు యూనియన్ కీలక బాధ్యతలను రామ్మూర్తి తీసుకున్నారు. వీరంతా సింగరేణి వ్యాప్తంగా పర్యటించి స్వయం ప్రతిపత్తి సంఘంగా ఉంటుందని కార్మికులకు వివరించనున్నారు. ఇకనుంచి కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయడానికి నిర్ణయించుకున్నట్లు రాజిరెడ్డి, రామ్మూర్తి తెలిపారు. సింగరేణిలో టీబీజీకేఎస్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు నిర్ణయాలు తీసుకు న్నారు. మరో రెండు రోజుల్లో బెల్లంపల్లి రీజియన్‌లో పర్యటించనున్నట్లు రాజిరెడ్డి, రామ్మూర్తి తెలిపారు.



సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యవర్గం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 2: శ్రీరాంపూర్ సీఐటీయూ బ్రాంచ్ కమిటీని మంగళవారం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావుల సమక్షంలో ఎన్నుకున్నారు. బ్రాంచ్ అధ్యక్షుడిగా గుల్ల బాలాజీ, కార్యదర్శిగా అంబాల శ్రీనివాస్, చీఫ్ ఆర్గనైజర్‌గా వెంగళ శ్రీనివాస్, కోశాధికారిగా కస్తూరి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సాయిళ్ల శ్రీనివాస్, పెరక సదానందం, తోడే సుధాకర్, బోడకుంట శంకర్, మహేష్, వెంకటేష్, శ్రీనివాస్, అభిలాష్, మహేష్, బానేష్, జాయింట్ సెక్రటరీలుగా కేసిపెద్ది శ్రీనివాస్, ఆవునూరి మహేష్‌లను ఎన్నుకున్నారు.గతంలో బ్రాంచ్ కార్యదర్శిగా పనిచేసిన గోదారి భాగ్యరాజ్‌ను యూనియన్ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పదవి నుంచి యూనియన్ నుంచి తొలగిస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి అతడికి, యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ

మందమర్రిటౌన్, ఏప్రిల్ 2: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా ఉపాధ్యక్షుడు భీమనాధుని సుదర్శన్ తెలిపారు. మంగళవారం ఏరియా వర్క్ షాపులో కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, రక్షణ విషయంలో యాజమాన్యం చొరవ చూపడం లేదన్నారు. ఉత్పత్తి , ఉత్పాదకతపై ఉన్న శ్రద్ధ కార్మికుల రక్షణపై ఉండడం లేదన్నారు. ఇటీవల స్టోర్‌లో నాసిరకం పరికరాలు ఉండడం వల్ల డబ్ల్యూస్టాఫ్ ఇనుప రేకులు లోడ్ చేసేటప్పుడు కార్మికునిపై రేకులు పడి మృతిచెందాడని అన్నారు. రెండు దశాబ్దాలుగా సింగరేణిని ప్రగతి పథంలో నడిపిస్తున్న కార్మికులకు లక్ష్యాలను పూర్తి చేసినందుకు బహుమతులు ఇవ్వాలని కోరారు. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న తమ యూనియన్‌ను సీఐటీయూ నాయకులు తమను విమర్శిస్తున్నారని, ప్రతి పక్ష సంఘం ఐఎన్‌టీయూసీ కూడా చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి ఆరోపణలు మానుకోవాలన్నారు. గుర్తింపు సంఘంగా తమకు త్వరగా గుర్తింపు పత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో పిట్ కార్యదర్శి శర్మ, నాయకులు బానయ్య, రాజేశం, భూమయ్య, వెంకటే శం, దినేష్, శ్రీనివాస్, వెంకట్రావు, సదానందం, చంద్రశేఖర్, కుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై పోలీసులను సంప్రదించాలి



మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2: మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళల రక్షణ కోసం షీటీం యాంటి ఉమెన్ ట్రాఫికింగ్ పై అవగాహన కార్యక్రమాల ద్వారా జిల్లాలో అవగాహన కల్పించామన్నారు. జిల్లా వ్యాప్తంగా జనవరి నెలలో షీ టీంకు రెండు కేసులు నమోదు చేశామన్నారు. అందులో ఒక కేసును ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, మరో కేసుకు కౌన్సెలింగ్ ఇచ్చామని వివరించారు. అలాగే 11 అవర్నెస్ ప్రోగ్రాంల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. చిన్న పిల్లల రక్షణ విషమయంలో పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్ వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సం బంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 8712 670564 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు.